సాక్షి
అనంతపురం
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



జిల్లాకు వర్షసూచన
జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.



టమాట కిలో రూ.25
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.25 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.18 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.5°/24.2°
జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- సర్కారు నిర్వాకంతోనే విజయవాడ ప్రజలకు దుర్భర పరిస్థితులు
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' ధ్వజం



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే విజయవాడ ప్రజలకు వరద కష్టాలు వచ్చి పడ్డాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం 'సాక్షి'తోఆయనమాట్లాడుతూ బుడమేరు వాగుకు భారీగా వరద వస్తోందని తెలిసి కూడా ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. ఇప్పటికే 60 మంది వరకూ ప్రాణాలు కోల్పోయారన్నారు. వరద నీటిలో లక్షలాది మంది ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఎంతమంది బాధితులున్నారో అంచనా వేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికీ విజయవాడలో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జీవనాధారం కోల్పోయి ఎంతో మంది రోడ్డున పడ్డారన్నారు. ప్రారంభంలో ఉన్న ఇళ్లను మాత్రమే అధికారులు చూశారని, లోతట్టు ప్రాంతాలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీససదుపాయాలనుకూడాప్రభుత్వంకల్పించడం లేదన్నారు. పరిస్థితి ఇలా ఉంటే సీఎం చంద్రబాబు మాత్రం ప్రచార ఆర్భాటం చేస్తున్నారన్నారు. అలా చేస్తున్నాం .. ఇలా చేస్తున్నాం అంటూ గోబెల్స్ ప్రచారానికి తెరలేపారన్నారు. సమావేశాలు నిర్వహించడం తప్పితే కనీసం ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకుని బాధితులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

భిక్షాటనతో నిరసన



టీ సర్కిల్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి, సత్యసాయి తాగునీటి కార్మికులు మంగళవారం కళ్యాణదుర్గంలో భిక్షాటన చేస్తూ ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ మాట్లాడుతూ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా భిక్షాటన చేయాల్సిన దుస్థితి కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 8 నెలలుగా జీతాలు అందకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు పాల్గొన్నారు.

చిరునవ్వుల జీవితం.. చిదిమేయొద్దు నేస్తం!



- జిల్లాలో గత 7 నెలల్లో 505 మంది బలవన్మరణం
- పెద్దాసుపత్రికి నగటున రోజూ రెండు నుంచి మూడు సూసైడ్ కేసులు
- చిన్న చిన్న కారణాలకే యువత అనాలోచిత నిర్ణయం
- నూరేళ్ల జీవితానికి క్షణాల్లో ముగింపు
- అయినవారితో మాట్లాడితే విపరీత ఆలోచనలు రావంటున్న నిపుణులు

❒ యాడికిలో కొండకిందగేరిలో నివాసముండే అచ్చమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు రాజశేఖర్ (23) ఉన్నారు. చాలా ఏళ్ల క్రితమే భర్త చనిపోగా, అచ్చమ్మ కూలి పనులతో పిల్లలను పెంచి పెద్దచేసింది. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. కుమారుడి కోసం కొత్తగా ఇల్లు కూడా నిర్మించి ఇచ్చింది. కొంత కాలంగా రాజశేఖర్ తాగుడుకు బానిస కావడంతో తల్లి మందలించింది. తాగుడు మానేసి బుద్ధిగా పనిచేసుకుని బతకాలని హితవు పలికింది. దీంతో క్షణికావేశానికి లోనైన రాజశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత నెల 30న ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

❒ హిందూపురానికి చెందిన శివశంకరరెడ్డి, చైత్ర 12 ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని శివశంకరరెడ్డి పోషించుకుంటున్నాడు. ఈ నెల 6న చిన్నపాటి విషయమై దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో క్షణికావేశానికి లోనైన చైత్ర ఇద్దరు పిల్లలను తీసుకుని రైలు పట్టాలపైకి చేరుకుంది. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించగా.. పోలీసులు అక్కడికి చేరుకుని చైత్రతో పాటు పిల్లలను పక్కకు లాగారు. భర్తను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించి ఇంటికి పంపారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ''బతుకు పోరాటము.. పడకు ఆరాటము'' అంటారు విఖ్యాత కవి కాళోజీ నారాయణరావు. ''పోరాడితే పోయేదేముంది'' అంటారు అభ్యుదయ కవి శ్రీశ్రీ. కానీ, అలాంటివేమీ తమకు పట్టవంటున్నారు కొందరు. క్షణికావేశంలో విపరీత నిర్ణయాలు తీసుకుంటూ విలువైన జీవితానికి సమాధి కడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గడిచిన ఏడు మాసాల్లోనే జిల్లాలో 505 మంది బలవన్మరణం పొందారు. ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది 25 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. యువత ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతుండడం కలచివేస్తోంది. అందులోనూ చదువుకున్న వారు ఇలాంటి విపరీత నిర్ణయాలు తీసుకుంటుండడం అన్ని వర్గాలను కలవరపరుస్తోంది.

పంచుకుంటే ఒత్తిడి దూరం..

ఒక్క క్షణం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న భావన ఆ మెదళ్లకు తోచడం లేదు. విచక్షణ మరచిపోతున్నారు. పెళ్లాం మాటవినలేదనో, ప్రియురాలు నో చెప్పిందనో.. ఏదైతేనేం చిన్న చిన్న కారణాలకే జీవితానికి కొడిగడుతున్నారు.జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాల్సిన వయసులో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులను విషాద సాగరంలో ముంచుతూ తరలిరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. ఏ వయసులోని వారికైనా ఒత్తిళ్లు సహజమని, ఆ క్షణంలో అయినవారితో పంచుకుంటే విపరీత ఆలోచనలు రావని నిపుణులు సూచిస్తున్నారు.

జీవితాన్ని బుగ్గిపాలు చేస్తున్న జూదం

ఇటీవలి కాలంలో ఎక్కువగా జూదం ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లు, గ్రామాల్లో పేకాటకు బానిసలై ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కువ మంది మధ్య వయస్కులు ఆర్థిక బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. జూదంలో సర్వస్వం కోల్పోయిన చాలా మంది మద్యం, గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

ఈ ఏడాదిలో బలవన్మరణాలు ఇలా..

జనవరి	ఫిబ్రవరి	మార్చి
70	70	86
ఏప్రిల్	మే	జూన్
65	47	65
జూలై		మొత్తం
102		505

కౌన్సెలింగ్‌తో మేలు..



చిన్నప్పటి నుంచి కష్టాలూ, సవాళ్లు లేకుండా పెరగడం, మానసిక ధైర్యం చెప్పేవారు లేకపోవడం వంటి కారణాలతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు అంచనా వేయాలి. సకాలంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఒత్తిడి నుంచి గట్టెక్కవచ్చు.

– డాక్టర్ విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, జాతీయ హెల్త్ మిషన్

కడుపుకోత పెట్టొద్దు..



యువత చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే మానసిక స్థైర్యం నింపే పాఠాలు నేర్పాలి. సవాళ్లను అధిగమించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరిన వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలి. కష్టాలు అధిగమించినప్పుడే జీవితంలో మంచి స్థానం లభిస్తుందనే విషయం మరువకూడదు.

– తరిమెల రమణారెడ్డి, 'అమ్మ' ట్రస్ట్ చైర్మన్, అనంతపురం

చెల్లినే చెరబట్టాడు!



అనంతపురం సిటీ: చెల్లెల్నే చెరబట్టిన ఓ కామాంధుడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనంతపురానికి కూతవేటు దూరంలోని ఓ గ్రామంలో ఈ అమానవీయ ఘటన జరిగింది. వివరాలు.. పద్నాలుగేళ్లు కూడా నిండని బాలిక ఐదో తరగతితో చదువు మానేసింది. కూలి పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటోంది. ఈ క్రమంలోనే సొంత పెద్దమ్మ కుమారుడు బాలికపై కన్నేశాడు. వావి వరసలు మరిచి మాయమాటలతో లోబరుచుకున్నాడు. తనకు అప్పటికే పెళ్లై, పిల్లలున్నా.. ఆ విషయం మరిచి బాలికపై పలుమార్లు అత్యాచారం చేశాడు. కుటుంబ సభ్యులకు విషయం చెప్పొద్దంటూ బెదిరిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే గర్భం దాల్చిన బాలిక ఈ నెల 7న ఇంట్లోనే ప్రసవించింది. పుట్టిన కొంతసేపటికే బిడ్డ చనిపోయాడు.

ఆస్పత్రికి రాకతో వెలుగులోకి..

బాలికను ఈ నెల 8న కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాలిక వివరాలు నమోదు చేసుకున్న ఆస్పత్రి సిబ్బంది ఆమెను ప్రసూతి వార్డులో ఉంచారు. ఐసీడీఎస్ అధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. స్పందించిన ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి నగరంలోని సఖి వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ శాంతామణి, సిబ్బందిని రంగంలోకి దింపారు. అనంతపురం, బాలిక సొంత మండలానికి చెందిన పోలీసులు బాధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కలిసి వివరాలు నమోదు చేసుకున్నారు.

బాధితులకు బెదిరింపులు..

బాలిక ప్రసవానికి కారకుడైన వ్యక్తిపై కేసు పెట్టేందుకు బాధిత కుటుంబ సభ్యులు సుముఖత చూపడం లేదని సమాచారం. కామాంధుడు దగ్గరి బంధువు కావడం, బాధితులను బెదిరిస్తుండడంతో కేసు నమోదుకు ముందుకు రావడం లేదని తెలిసింది. నిందితుడ్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పోక్సో కేసు నమోదు చేస్తామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు.

టీడీపీ ఇసుకాసురుల ఆటకట్టు





పి.జలాలపురం వద్ద డంప్ చేసిన ఇసుక, పెరవలి వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య, మైనింగ్ అధికారులు

శింగనమల: మండల పోలీసులు టీడీపీకి చెందిన ఇసుకాసురుల ఆట కట్టించారు. శింగనమల మండలం పెరవలి, పి.జలాలపురం వద్ద వారి అక్రమ ఇసుక డంప్‌లను సీజ్ చేశారు.నలుగురిపై కేసులు నమోదు చేశారు. మంగళవారం తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ రామాంజులరెడ్డి ఇసుక డంప్‌లపై దాడులు నిర్వహించారు. పెరవలి సమీపంలో ఇసుక డంప్‌లో 94 టన్నులు, పి.జలాలపురం వద్ద వంకలోని డంప్‌లో 135 టన్నులు మొత్తం 229 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. అలాగే, ఓ ఇటాచీని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచిన టీడీపీ నాయకులు మారుతి నాయుడు, నాగరాజు, రంగారెడ్డి, త్రిలోకనాథ్ రెడ్డిపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేసినా, రీచ్‌లు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.లక్షల ఇసుక కొల్లగొట్టారు..

పెరవలి సమీపంలోని వంకతో పాటు పి.జలాలపురం వద్ద డంప్‌ల నుంచి ఇప్పటికే వందల టిప్పర్ల ఇసుకను తరలించినట్లు తెలిసింది. పగటి పూట ట్రాక్టర్ల ద్వారా డంప్ చేసి, రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా బయటి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రూ.30 లక్షల విలువైన ఇసుకను కొల్లగొట్టినట్లు టీడీపీ నాయకులే అంటున్నారు.

14 నుంచి 'స్వచ్ఛతా హి సేవ'



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాలను ఈనెల 14 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం వివిధ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 వరకూ ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మునిసిపాలిటీలు, గ్రామాల్లో శ్రమదానం చేపట్టాలన్నారు. సఫాయి కర్మచారులకు రక్షణ పరికరాలు అందించాలన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్‌రావు, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు సహకరించాలి

ఇసుక రవాణాలో ఇబ్బందులు రాకుండా సహకరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులు, రవాణాదారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్దేశించిన ధరలను అమలు చేస్తున్నామన్నారు. పలువురు ఇసుక రవాణాదారులు మాట్లాడుతూ రవాణా ధరలు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. మరిన్ని ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రతి రీచ్ వద్ద వేబ్రిడ్జ్ ఉంచాలన్నారు. వాహనాల్లో తగినంత ఇసుకను నింపుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిశీలిస్తామన్నారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. రోగులకందుతున్న సేవలపై వారి కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి అధికారులతో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు తదితరులున్నారు.

రేపటి నుంచి రెండు మ్యాచులు

- ముస్తాబైన ఆర్డీటీ క్రీడా గ్రామం
- బంగ్లాదేశ్ పర్యటనకు ఎంపిక కావడంతో స్టార్ క్రికెటర్లు దూరం

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా గురువారం నుంచి ఆర్డీటీ క్రీడా గ్రామంలోని రెండు మైదానాల్లో మ్యాచులు జరగనున్నాయి. నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇండియా టీం-ఏ, ఇండియా టీం-డీ మ్యాచ్ ఆర్డీటీ క్రీడాగ్రామం ప్రధాన స్టేడియంలో జరగనుంది. ఇండియా టీం-బీ, ఇండియా టీం- సీ మధ్య మరో మ్యాచ్ క్రీడాగ్రామంలోని రెండో గ్రౌండ్‌లో జరగనుంది. ప్రధాన స్టేడియంలో జరిగే మ్యాచ్ వీక్షించేందుకు ప్రేక్షకులకు అవకాశం ఉంటుంది. రెండో గ్రౌండ్‌లో జరిగే మ్యాచ్‌ను నేరుగా వీక్షించే అవకాశం లేదు.

ప్రాక్టీస్‌లో నిమగ్నం..

క్రీడాకారులు బుధవారం నెట్ ప్రాక్టీస్‌లో బిజీగా గడిపారు. ఇండియా-ఏ జట్టుకు చెందిన మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ఎస్‌కే రషీద్, తిలక్ వర్మ, శివమ్ దూబేతో పాటు ఇండియా -బీ జట్టుకు చెందిన అభిమన్యు ఈశ్వరన్, రింకూ సింగ్, నవదీప్ సైనీ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్ తదితరులు ప్రాక్టీస్ చేశారు.

స్టార్ క్రికెటర్లు దూరం..

దులీప్ ట్రోఫీకి ఐదుగురు స్టార్ క్రికెటర్లు దూరం అయ్యారు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టెస్ట్ మ్యాచులకు ఎంపిక కావడంతో శుభమన్ గిల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కులదీప్ యాదవ్, ఆకాష్ దీప్‌లు రావడం లేదు. దీంతో వీరి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేశారు. ప్రథమ్ సింగ్ (రైల్వేస్), ఆకాష్ వాడ్కెర్ (విదర్భ), ఎస్‌కే రషీద్ (ఆంధ్రా క్రికెట్), ఎడమచేతి స్పిన్నర్ షామ్స్ ములాని, అఖిబ్ ఖాన్ (ఉత్తరప్రదేశ్)లకు చోటు కల్పించారు. మయాంక్ అగర్వాల్‌ను ఇండియా-ఏ జట్టు కెప్టెన్‌గా నియమించారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

రెండు మైదానాల్లో మ్యాచులు నిర్వహించనున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన స్టేడియాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ప్రేక్షకులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. మ్యాచులు ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీసీఐ మేనేజర్ సిద్దేశ్వర్, మహిళా క్రికెట్ వింగ్ ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగా రెడ్డి, ఏసీఏ లాజిస్టిక్ మేనేజర్ గౌరీ శంకర్, అడ్మిన్ మేనేజర్ ఆదిత్యవర్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

దులీప్ ట్రోఫీ నిర్వహణలో దిద్దుబాటు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: దులీప్ ట్రోఫీ నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. 'నిర్వహణలో డకౌట్' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఒక అధికారి తన కిందిస్థాయి అధికారులకు 3 వేల పాసులు పంచినప్పటికీ, సింహభాగం గైర్హాజరైన విషయాన్ని కూడా 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ క్రమంలో పాసులను పారదర్శకంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మ్యాచ్ వీక్షించే అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే, ప్రేక్షకులందరికీ మంచినీటి సదుపాయం ఉచితంగా కల్పించనున్నారు. వాటర్ బాటిళ్లు ఇస్తే ఫీల్డ్‌లోని ఆటగాళ్లపై విసురుతారనే ఉద్దేశంతో గ్లాసుల్లోనే మినరల్ వాటర్ అందివ్వనున్నారు.

నిమజ్జనోత్సవానికి పక్కా ఏర్పాట్లు



ఆత్మకూరు: వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగించేలా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని పంపనూరు హంద్రీనీవా కాలువ వద్ద పక్కా ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాల వెలుగులో విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు. క్రేన్,జేసీబీలు అందుబాటులో ఉంచుతున్నారు. కాలువకు ఇరువైపులా ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇతర వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. పోలీసులతో పాటు రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు కూడా కాలువ దగ్గర ఉండనున్నట్లు తెలిసింది.

కాలువ దగ్గరికి వెళ్లొద్దు..

పంపనూరు వద్ద హంద్రీ నీవా కాలువలో ప్రస్తుతం నీరు వేగంగా ప్రవహిస్తోంది. అజాగ్రత్తతో కాలువలో పడితే ప్రాణాలు పోయే ప్రమాదమే ఉంటుంది. ఈ క్రమంలో కాలువ వద్దకు ఎవరూ వెళ్లరాదని పోలీసులు సూచిస్తున్నారు.

పర్యావరణ స్పృహ.. వినాయకుడు ఆహో

తాడిపత్రి అర్బన్: స్థానిక పుట్లూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ వినాయక విగ్రహం పట్టణ వాసులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విజ్ఞరాజా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వినాయక ప్రతిమను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మానవ తప్పిదాలతో ఇటీవల పర్యావరణం క్షీణిస్తోంది. దీంతో విపత్తులు సంభవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వేలమంది నిరాశ్రయులవుతున్నారు. ఈ విషయం స్థానిక 'విజ్ఞరాజా యూత్' సంఘ సభ్యులను కలచివేసింది. ఈ క్రమంలోనే వినాయక చవితి రావడం, అందరికంటే భిన్నంగా విగ్రహాన్ని ప్రతిష్టించి మంచి సందేశమివ్వాలనే తలంపు విజ్ఞరాజా యూత్ సభ్యుల్లో పుట్టింది. అనుకున్నదే తడువుగా వినాయక మంటపాన్ని ఆకులు, మర్రి చెట్టు ఊడలు, వేర్లతో ఎంతో సుందరంగా అలంకరించి వనంలా తీర్చిదిద్దారు. హైదరాబాద్ నుంచి వినాయక విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్టించారు. ఈ క్రమంలో విగ్రహాన్ని చూసేందుకు మంటపంలోకి వెళ్తున్న భక్తులు.. ఆహ్లాదకరంగా ఉండే అడవిలోకి అడుగు పెట్టామనే భావన పొందుతున్నారు. దీంతో ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి పెద్ద సంఖ్యలో ఆక్సిజన్ వినాయకుడిని చూసేందుకు వస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడాలంటూ ఆకట్టుకునే రీతిలో సందేశమిస్తున్న విజ్ఞరాజా యూత్ సభ్యులను అభినందిస్తున్నారు.



అడవిని తలపిస్తున్న మంటపంలో ఆక్సిజన్ వినాయకుడు

ప్రబలుతున్న కుష్టు

- ఇంటింటి సర్వేలో 50 మంది అనుమానితుల గుర్తింపు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులు	350 మంది
జబ్బు నయమైన వారి సంఖ్య	150
చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య	200
కొత్తగా నిర్ధారించిన కేసులు	50
అనుమానిత కేసులు	987
రాయదుర్గం, కళ్యాణదుర్గంలో కేసులు	20

రాయదుర్గం: జిల్లాలో కుష్టు వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఏటా పదుల సంఖ్యలో కొత్త కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం. ఓ వైపు చికిత్స పొంది నయమవుతున్న వారి పెరుగుతుంటే... మరో పక్క అదే స్థాయిలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. బాధితులు సకాలంలో చికిత్స పొందక పోవడంతో కొందరు వైకల్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కుష్టు వ్యాధిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జూలై 18 నుంచి ఆగస్టు 10 వరకూ పక్షోత్సవాల పేరుతో ఇంటింటా సర్వే చేపట్టారు. అనుమానిత కేసులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో కుష్టు వ్యాధి కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. గతేడాది 350 కేసులు నమోదు కాగా, ఇందులో 150 కేసులు పూర్తిగా కోలుకున్నాయి. సుమారు 200 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఈ ఏడాది జూల్ నుంచి ఆగస్టు వరకూ నిర్వహించిన పక్షోత్సవాల్లో పెద్ద సంఖ్యలో అనుమానితులను వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించింది. సర్వేలో భాగంగా 23,23,089 ఇళ్లలో 21,21,269 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 987 అనుమానిత కేసులు వెలుగు చూశాయి. వీరిలో 50 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది.



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆ రెండు ప్రాంతాల్లోనే ఎక్కువ

రాయదుర్గం, కళ్యాణదుర్గం సరిహద్దు ప్రాంతాలను కుష్టు వ్యాధి కబళిస్తోంది. ఆయా ప్రాంతాల్లో వలస జీవులు ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అత్యధికులు కర్ణాటక ప్రాంతానికి ఉపాధి కోసం వలస వెళ్లి వచ్చిన వారే వ్యాధి బారిన పడినట్లుగా అధికారులు గుర్తించారు. గత ఏడాది వ్యాధి నిర్ధారణ అయిన వంద మందిలో క్రమం తప్పకుండా అందుకున్న చికిత్సల ద్వారా 20 మంది పూర్తిగా కోలుకున్నారు. తాజా సర్వేలో కొత్తగా 221 మంది అనుమానితులను గుర్తించారు. అందులో 20 మందికి వ్యాధి నిర్ధారణ అయింది.

తొలి దశలో చికిత్స తీసుకుంటే మేలు

సకాలంలో రోగిని గుర్తించి చికిత్స అందజేస్తే వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చునని వైద్యాధికారులు అంటున్నారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రీ అనే క్రిమి కారణంగా సోకే కుష్టు వ్యాధికి చికిత్స పొందకుండా నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అన్ని అవయవాలకు పాకే అవకాశం ఉంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన తర్వాత 3 నుంచి 15 ఏళ్ల తర్వాత దుష్పరిణామాలు బయటపడుతాయి. తొలిదశలో వ్యాధిని నిర్ధారించుకుని ఎండీటీ చికిత్స తీసుకుంటే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు. శరీరంలో ఎరుపు, రాగి రంగు స్పర్శ లేని మచ్చలుంటే కుష్టుగా అనుమానించి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కుష్టు వ్యాధి బారిన పడినవారు వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా చికిత్స తీసుకుని మందులు వాడాలని గ్రామీణులకు వైద్య ఆరోగ్య సిబ్బంది సూచిస్తున్నారు. కుష్టు వ్యాధి తీవ్రతపై గ్రామీణులకు వారు చైతన్య పరుస్తున్నారు. వ్యాధిగ్రస్తులు వస్తువులను తాకినప్పుడు స్పర్శ శాతం తక్కువగా ఉంటుంది కాబట్టి వేడి వస్తువులకు దూరంగా ఉండాలంటున్నారు. స్పర్శ కోల్పోయిన కాళ్లు, చేతుల భాగాలపై జాగ్రత్త వహించాలంటున్నారు. మైక్రో సెల్యులర్, రబ్బర్ చెప్పులు ధరించాలని, వీటిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని సూచిస్తున్నారు. మచ్చలు ఉన్న ప్రాంతాలను ప్రతి రోజూ వేడినీటితో శుభ్రం చేయాలని, చికిత్స తీసుకునే సమయంలో మూత్ర విసర్జనలో మార్పులు కనిపించినా ఎలాంటి అనర్థాలు ఉండవని అవగాహన కల్పిస్తున్నారు.

పూర్తిగా నయం చేయవచ్చు



జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా అరికట్టేలా ప్రణాళికలు రూపొందించాం. సరిహద్దు ప్రాంతాల్లోనే వ్యాధి విస్తరిస్తున్నట్లు గుర్తించాం. వ్యాధి లక్షణాలున్న వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చికిత్స తీసుకోవాలి. శరీరంపై తెల్లని, రాగి రంగులో స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. దీనిని మొదట్లోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. జిల్లాలో అన్నీ ఆరోగ్య కేంద్రాల ఉచితంగా మందులు అందజేస్తారు.

– డాక్టర్ అనుపమ, కుష్టు నివారణ అధికారి, అనంతపురం

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తి మృతి

శెట్టూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు....శెట్టూరు మండలం కంబాలపల్లికి చెందిన గొల్ల ధనుంజయ (40) మంగళవారం ఉదయం మటన్ (మాంసం) కొనుగోలుకు తన కుమారుడితో కలసి ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయలుదేరాడు. బచ్చేహళ్లి గేట్ దాటగానే రోడ్డుపై మేకలు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు చేయలేక కిందపడ్డారు. ధనుంజయకు తీవ్ర గాయాలు కాగా, కుమారుడు సుదర్శన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ధనుంజయ మృతి చెందాడని నిర్ధారించారు. కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భార్య గొల్ల చిట్టమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

15న వీఏహెచ్ఏలకు సామర్థ్య పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: పశుశాఖ పరిధిలో ఇటీవల కొత్తగా నియమితులైన విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (వీఏహెచ్ఏ)కు ఈ నెల 15న సామర్థ్య పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం వీఏహెచ్ఏలకు హాల్‌టికెట్లను ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి పంపిణీ చేసి, మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 451 మందికి అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక శిక్షణతో పాటు క్షేత్రస్థాయి పనితీరుపై పరీక్ష ఉంటుందన్నారు.

ఇరువురు పశువైద్యులకు ఏడీగా పదోన్నతి



పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామికి బొకే అందజేస్తున్న డీడీగా పదోన్నతి పొందిన కాంతమ్మ

అనంతపురం అగ్రికల్చర్: పశుశాఖలో ఇరువురు పశువైద్యులు (వీఏఎస్)లకు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పదోన్నతి దక్కింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టరేట్ నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు ఆస్పత్రి డాక్టర్ పెద్దన్నకు ఏడీగా పదోన్నతి కల్పిస్తూ జేడీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇక్కడ ఏడీగా ఉన్న డాక్టర్ నాగార్జునరెడ్డి గత నెలాఖరున స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. అలాగే బొమ్మనహాళ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వర్‌కు పదోన్నతి కల్పించి ఉరవకొండ ఏరియా ఆస్పత్రి ఏడీగా బదిలీ చేశారు. అక్కడ ఏడీగా ఉన్న డాక్టర్ కాంతమ్మకు డీడీగా పదోన్నతి కల్పించి పెనుకొండ షీప్‌ఫారానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె జేడీ జీపీ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి, మాట్లాడారు.

కేవీకేలో అందుబాటులో నారు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కూరగాయలు, పూలు నారు పెంచి రైతులకు అందజేస్తున్నారు. ఈ మేరకు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మంగళవారం తెలిపారు. కూరగాయలకు సంబంధించి ఏ నార కావాలో రైతులు ముందుగానే తెలిపితే వాటిని పెంచి అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 99497 37160లో సంప్రదించాలని కోరారు.

బాలయ్య ఇలాకాలో అరాచకం

- హిందూపురంలో బరి తెగించిన టీడీపీ నాయకులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై మూకుమ్మడి దాడి
- 8 మందికి తీవ్ర గాయాలు



గాయపడిన యశోదమ్మ, హనుమంతరెడ్డి, శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, దాడి చేస్తున్న దృశ్యం

హిందూపురం: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయి. వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపులు, దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం హిందూపురంలోని కొల్లకుంటలో టీడీపీ నాయకులు మంజునాథ్ అలియాస్ గొర్రెల మంజు, వడ్డె నవీన్‌తో పాటు బయటి ప్రాంత గూండాలు నలుగురు వాహనంలో వచ్చి ఇంటి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్ కొల్లకుంట శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హనుమంతరెడ్డి, నాగభూషణరెడ్డి, వినుత, యశోదమ్మ, గోవిందరెడ్డి, అలివేలమ్మ, భాగ్యమ్మ, వెంకటలక్ష్మిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. హనుమంతరెడ్డితో పాటు మరో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో అనంతపురానికి తరలించారు.

వారించినందుకు దాడి

కొల్లకుంటలో సోమవారం గ్రామస్తులు వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ కండువాలు కప్పుకొని పాల్గొనడంతో అక్కడున్న వారు అభ్యంతరం తెలపడంతో టీడీపీ నాయకులు రచ్చ చేశారు. ఆ సమయంలో వారించిన శివశంకర్‌రెడ్డిని కొట్టడానికి ప్రయత్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని నచ్చజెప్పి పంపించేశారు. గొడవ సమసిపోయిందనుకునే లోపు మంగళవారం సాయంత్రం మంజునాథ్, వడ్డె నవీన్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులు వాహనంలో వచ్చి శివశంకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి మహిళలపై, వృద్ధులపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో శివశంకర్‌రెడ్డి ఇంట్లో లేరు. గ్రామస్తులు అడ్డుకోవడంతో వారందరూ పారిపోయారు.

టీడీపీ నాయకులతో ప్రాణహాని

టీడీపీ నాయకులు కక్ష సాధింపులు, దాడులకు పాల్పడుతున్నారని బాధితుడు శివశంకర్‌రెడ్డి వాపోయారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇంట్లో లేని సమయంలో అమ్మ, నాన్న, భార్య, బంధువులపై టీడీపీ నాయకులు దాడి చేశారన్నారు. మహిళలని చూడకుండా నడి వీధిలో దుస్తులు చిరిగేటట్టు, రక్తం వచ్చేలా కొట్టారన్నారు. గత ఐదేళ్లు గ్రామంలో ఏ ఒక్కరినీ తాము దూషించలేదని, గొడవలు చేయలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇలా దాడులు చేయడం చూస్తుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడున్నాయనిపిస్తోందన్నారు. దాడులు చేసిన వారి నుంచి తమకు ప్రాణహాని ఉందన్నారు.

బాధితులకు పరామర్శ

శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు, మునిసిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ప్రశాంత్, కౌన్సిలర్లు ఆసీఫ్, రామచంద్ర, ముస్తాక్, ఏ బ్లాక్ కన్వీనర్ మన్సూర్, లాయర్ వెంకటరెడ్డి, నాయకులు హబీబ్, ఫారూక్, అయూబ్, మార్కెట్ చాంద్, నవీన్ తదితరులు ఆస్పత్రిలో పరామర్శించారు. దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలని, కొల్లకుంటలో శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

మెగా మాల్‌లో అగ్నిప్రమాదం

- రూ.1.50 కోట్ల ఆస్తి నష్టం



మెగా మాల్‌లో ఎగిసిపడుతున్న మంటలు

తాడిపత్రి అర్బన్: స్థానిక లలితా మెగా మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలు... తాడిపత్రిలోని సీబీ రోడ్డులో ఉన్న లలితా మెగా మాల్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో సమీపంలోని మెగా మాల్ వెనుక భాగంలోని పై అంతస్తులో సోలార్ ఎగ్జాట్ ఫ్యాన్ నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో సమీపంలోనే వినాయక మంటపం వద్ద మేల్కొని ఉన్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ బాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసే ప్రయత్నం చేపట్టారు. అయితే ఉవ్వెత్తున మంటలు ఎగిసి పడుతుండడంతో అనంతపురం నుంచి మరొక ఫైర్ ఇంజిన్‌ను రప్పించారు. సమీపంలోని అర్జాస్ స్టీల్ పరిశ్రమ, సాగర్ సిమెంట్ పరిశ్రమలోని ఫైరింజన్లను తెప్పించి దాదాపు ఆరు గంటలకు పైగా శ్రమించి మంగళవారం ఉదయం 6 గంటలకు మంటలను పూర్తిగా అదుపు చేశారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ సాయిప్రసాద్, క్లూస్ టీం సిబ్బంది అక్కడకు చేరుకుని అగ్ని ప్రమాదానికి కారణాలపై అన్వేషించారు. దాదాపు రూ.1.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని హత్య కేసులో వీడిన మిస్టరీ

- నాలుగేళ్లుగా ప్రేమించాలంటూ వేధింపులు
- తనకు కాకుండా మరెవరికీ దక్కకూడదనే ఘాతుకం
- పథకం ప్రకారం వేటకొడవలితో దాడి
- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హేమంత్‌కుమార్

ఆత్మకూరు: ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని సరిత హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. తాను ప్రేమించిన యువతి తనకు కాకుండా మరెవ్వరికీ దక్కకూడదనే దురుద్దేశంతోనే ప్రేమికుడు ఈ ఘాతుకానికి తెగించినట్లు నిర్ధారణ అయింది. కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఆత్మకూరు పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్ట్ వివరాలను సీఐ హేమంత్‌కుమార్ వెల్లడించారు. ఈ నెల 7న వడ్డుపల్లి సమీపంలోని పీఏబీఆర్ కాలువ వద్ద విద్యార్థిని సరిత హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో గుమ్మఘట్ట మండలం వెంకటాంపల్లికి చెందిన తిప్పేస్వామి అలియాస్ పండుని అనుమానితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో తానే సరితను హతమార్చినట్లు అంగీకరించాడు.

పెళ్లి చేసుకుంటానంటే కుదరదన్నారు

ఆత్మకూరు మండలం సిరిగేదొడ్డ గ్రామానికి చెందిన బోయ సరితను నాలుగైదు ఏళ్లుగా తిప్పేస్వామి ప్రేమించాలని వెంటపడేవాడు. ఈ క్రమంలో ఒకే కులస్తులు కావడంతో సరితను తనకు ఇచ్చి పెళ్లి జరిపించాలని ఓ సారి నేరుగా వెళ్లి ఆమె తండ్రితో మాట్లాడాడు. అయితే తన కుమార్తెను బాగా చదివించాలని అనుకుంటున్నానని, ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పెళ్లి చేసే ఆలోచన తమకు లేదని తల్లిదండ్రులు నిరాకరించారు. ఈ విషయం తెలుసుకున్న తిప్పేస్వామి కుటుంబసభ్యులు ఆయనకు మరొక అమ్మాయితో పెళ్లి జరిపించారు. అయినా సరితను ఎలాగైనా దక్కించుకోవాలని తరచూ ఆమెకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఆర్ట్స్ కళాశాలలో చదువుకుంటున్న సరిత... ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే తన చదువును మధ్యలోనే ఆపించేస్తారని భయపడి ఎవరితోనూ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ వచ్చింది.

పథకం ప్రకారమే హత్య

వినాయక చవితి పండుగకు సిరిగేదొడ్డికి సరిత వచ్చిన విషయం తెలుసుకున్న తిప్పేస్వామి ఆమెకు ఫోన్ చేశాడు. 'ఈ రోజు కలవకపోతే నీ అంతు చూస్తా... నీ కాలేజీకే వచ్చి నిన్ను అల్లరి పెడతా' అని బెదిరించాడు. దీంతో భయపడిన సరిత తనకు కళాశాలలో పని ఉందంటూ తండ్రి తెలిపి శనివారం అనంతపురానికి వెళ్లే బస్సు ఎక్కింది. విషయం తెలుసుకున్న తిప్పేస్వామి ఆమెను పంపనూరు సిటీ పార్క్ వద్ద బస్సు నుంచి కిందకు దిగేలా చేశాడు. అనంతరం తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వడ్డుపల్లి సమీపంలోని పీఏబీఆర్ కాలువ వద్దకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుందామంటూ బలవంతం చేశాడు. అందుకు ఆమె అంగీకరించలేదు. అదే సమయంలో తన తండ్రి ఫోన్ చేయడంతో తల దించుకుని మాట్లాడుతుండగా... తన వెంట తెచ్చుకున్న వేటకొడవలితో సరిత మెడపై బలంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం సిరిగేదొడ్డి సమీపంలో తిప్పేస్వామిని అరెస్ట్ చేసి, వివరాలు ఆరా తీయడంతో నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి వేటకొడవలి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 58.66 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. 41 రోజులకు గానూ రూ.58,66,842 నగదు, అన్నదానము హుండీ ద్వారా రూ.14,882 నగదు భక్తులు స్వామివారికి సమర్పించారు. వీటితో పాటు 5 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారు, 2.1 కిలోల వెండి, 1 అమెరికన్ డాలర్‌ను సమర్పించినట్లు ఈఓ వివరించారు. గుంతకల్లు ఆర్టీసీ హనుమాన్ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'పది' ఫెయిల్ విద్యార్థులకు ఊరట

- పాత సిలబస్ ఆధారంగానే పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: 2023–24, అంతకముందు పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు పాత సిలబస్ ఆధారంగానే ఈ ఏడాది పరీక్షలుంటాయని ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2015 మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులకు కొత్త సిలబస్ ఆధారంగా పరీక్షలుంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని వివరాలు, బ్లూప్రింట్లు సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచారని పేర్కొన్నారు. గతంలో విత్‌హెల్డ్, మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడిన విద్యార్థులకు మార్చిలో జరిగే పరీక్షలకు అనుమతించమని స్పష్టం చేశారు.

జీబీసీ పరిశీలన

విడపనకల్లు: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్(జీబీసీ)ను మంగళవారం జీబీసీ ఈఈ వెంకటరమణ, డీఈ రఘుచరణ్ పరిశీలించారు. జీబీసీ ప్రధాన కాలువ నాల్గవ కిలోమీటర్ వద్ద శిథిలమైన బ్రిడ్జి, సైడ్ వాల్ పనులు బుధవారం నుంచి చేపట్టాలని సిబ్బందిని ఈఈ ఆదేశించారు. రెండు మూడు రోజుల్లోపు కాంక్రీట్ పనులు పూర్తి చేయాలన్నారు.

మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: జిల్లాలోని గుత్తి వద్ద ఉన్న బీపీసీఎల్, ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ వద్ద ఉన్న అమకతాడు టోల్‌ప్లాజా వద్ద సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల భర్తీకి మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమకతాడు టోల్ ప్లాజాకు సంబంధించి పూర్తి వివరాలకు 92970 00595, బీపీసీఎల్ సంబంధించి వివరాలకు 96449 91421లో సంప్రదించాలని సూచించారు.

యూజీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యూజీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ మంగళవారం తెలిపారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అప్‌లైడ్ జెనెటిక్స్‌లో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న జయప్రీతి

అనంతపురం: ఎమ్మెస్సీ అప్‌లైడ్ జెనెటిక్స్‌లో అనంతపురానికి చెందిన ఆదిశేషయ్య, లలిత దంపతుల కుమార్తె జయప్రీతి బంగారు పతకాన్ని సాధించింది. మంగళవారం జరిగిన బెంగళూరు యూనివర్సిటీ 59వ స్నాతకోత్సవంలో కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్, వీసీ డాక్టర్ జయకర్, యూజీసీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ ఆమెకు బంగారు పతకాన్ని అందజేశారు. కాగా, జయప్రీతి... 'ద ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్'లో ఎమ్మెస్సీ అప్‌లైడ్ జెనెటిక్స్ కోర్సును సీజీపీఏ 9.11 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించి బెంగళూరు యూనివర్సిటీ మొదటి ర్యాంక్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బంగారు పతకంతో పాటు ప్రొఫెసర్ ఎన్‌జే శెట్టి క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు.

మాతాశిశు మరణాలపై సమీక్ష

అనంతపురం మెడికల్: మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. గత నెలలో జిల్లాలో చోటు చేసుకున్న రెండు మాతృ, 25 శిశు మరణాలకు సంబంధించి సంబంధిత వైద్యాధికారులతో మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆమె సమీక్షించారు. మాతాశిశు మరణాల్లో నిర్లక్ష్యం కన్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డీఐఓ డాక్టర్ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, గైనకాలజిస్టు డాక్టర్ నిస్సార్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రవి (ఫైల్)

పామిడి: విద్యుత్ షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన రవి (26) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనుల్లో పాలుపంచుకునేవాడు. మంగళవారం ఉదయం మెట్ల నిర్మాణ పనుల్లో నిమగ్నమైన రవి... వైబ్రేటర్ ఆన్ చేయగానే స్కిల్ వైర్ తెగి గ్రిల్ డోర్‌కు విద్యుత్ సరఫరా అయింది. ఈ విషయం తెలియని రవి... నేరుగా వెళ్లి డోర్‌ను తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రవి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు ఉన్నారు. కాగా, విషయం తెలియగానే డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు ఆస్పత్రికి చేరుకుని మార్చురీలోని రవి మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

'కాంప్లెక్స్ సమావేశం వాయిదా వేయండి'

అనంతపురం ఎడ్యుకేషన్: మహాలయ పౌర్ణమి నేపథ్యంలో ఈ నెల 18న తలపెట్టిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని వాయిదా వేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జ్ డీఈఓ కృష్ణయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మహాలయ పౌర్ణమికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా వాయిదా వేయాలని విన్నవించారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి : ఎస్పీ



గార్లదిన్నె పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

గార్లదిన్నె/పామిడి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు అందజేసే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సిబ్బందిని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. మంగళవారం ఉదయం గార్లదిన్నె పీఎస్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఈ నెల 14న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసుల్లో ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జగదీష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ భవనాన్ని, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై సీఐ యుగంధర్‌తో ఆరా తీశారు.

క్లుప్తంగా

స్వీపర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నాగప్ప కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏఆర్ అధికారులు

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన స్వీపర్ నాగప్ప కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఏఆర్ అధికారులు కొత్తచెరువులో ఉన్న నాగప్ప కుటుంబ సభ్యులకు రూ.25 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐ మధు, ఏఆర్ ఎస్ఐ ముస్తఫా, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

నేరస్తులను శిక్షించాలి

అనంతపురం అర్బన్: గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థినిని ఆత్మకూరు అటవీ ప్రాంతంలో దారుణంగా హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘటన కార్యదర్శి మల్లీశ్వరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు, ప్రేమ పేరిట హంతక దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఏ క్షణాన ఏమి జరుగుతోందోనన్న అభద్రత వాతావరణంలో మహిళలు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ విద్యార్థిని హత్యపై దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులను కోరారు. నేరస్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి అండగా నిలబడాలన్నారు.

వెంకోబరావు ఇక లేరు



వెంకోబరావు (ఫైల్)

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సీనియర్ కళాకారుడు నైషధం వెంకోబరావు (72) హఠాన్మరణం చెందారు. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన ఆయన కుటుంబం దశాబ్దాల క్రితం అనంతలో స్థిరపడింది. ఓ వైపు పురోహిత్యం చేసుకుంటూనే ద్విగళ గాయకుడిగా ప్రసిద్ధి చెందారు. ఆయన ప్రతిభను ఆ రోజుల్లో ప్రఖ్యాత సినీ నేపథ్య గాయని జిక్కీ ఎంతో మెచ్చుకునే వారు. ఏక కాలంలో ఆడ, మగ గొంతుకలతో స్వరాలను అద్భుతంగా ఆలపిస్తూ అలరించే వేంకోబరావు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. ముఖ్యంగా జిల్లాలో ఎక్కడ సాంస్కృతిక సంబరాలు జరిగినా ఆయన ద్విగళం మార్మోగేది. అలనాటి పాత మధుర గీతాలను ఘంటసాల, సుశీల గొంతులను అనుకరిస్తూ ఆలపిస్తుంటే శ్రోతలు మైమరిచిపోయేవారు. వేంకోబరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వేంకోబరావు మృతిపై అనంత ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షుడు పాలసముద్రం నాగరాజు, ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు కేవీఎస్ చలపతి రెడ్డి, ఎల్కేపి కళాకారులు, రంగస్థల నటులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య అన్నారు. మంగళవారం స్థానిక ఐలమ్మ కాలనీలో సమాఖ్య నాయకుడు నాగరాజు అధ్యక్షతన చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం ప్రజల హక్కుల కోసం తిరుబాటు చేసిన సాయుధ పోరాటంలో వీరవనిత ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారన్నారు. తెలంగాణ విముక్తి కోసం సాగిన పోరాటంలో పాల్గొని ప్రాణాలు అర్పించిందన్నారు. ఆమె పోరాటం ఆదర్శంగా తీసుకుని ప్రజాసమస్యల సాధనకు ప్రతి కార్యకర్త ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సి.వి.హరికృష్ణ, ఉపాధ్యక్షుడు నాగప్ప, నాయకులు భూషణ, సి.వి.లలిత, ఈశ్వరమ్మ, పాండు, వీరాంజి, సంజీవులు, లక్ష్మీ నారాయణ, చిన్న నారాయణ స్వామి, శీనా, నరేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ముష్టికోవెలలో వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామంలో సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా పులిహోర తిన్న భక్తులకు ఫుడ్‌పాయిజన్ అయింది. పలువురికి తీవ్రమైన కడుపునొప్పి వాంతులు, విరేచనాలు కావడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. బాధితులు చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. మంగళవారం విషయం తెలుసుకున్న శ్రీసత్యసాయి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో బాధితులకు వైద్య పరీక్షలు చేశారు.



సప్తగిరి సర్కిల్‌లో వినాయకుడి కథ వింటున్న భక్తులు



సప్తగిరి వినాయకుడికి లేజర్ షో



హౌసింగ్ బోర్డులో కోలాటం ఆడుతున్న దృశ్యం



ఎల్బీ నగర్‌లో శ్రీకృష్ణ వినాయకుడు



శాంతినగర్‌లో వినాయకుడి పూజల్లో పాల్గొన్న భక్తులు

నేడు గణేశ్ శోభాయాత్ర

- మునిసిపల్ కార్యాలయం నుంచి రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్ రోడ్డు, తాడిపత్రి బస్టాండ్, టవర్‌క్లాక్ మీదుగా సాగనున్న వినాయకుల ఊరేగింపు
- కొడిమి వద్ద ఉన్న వంక, పంపనూరు, రాప్తాడు పండమేరు తదితర ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



ఉమానగర్‌లో రేణుకా ఎల్లమ్మ వినాయకుడు



ఐదో రోడ్డులో ఆకట్టుకున్న వినాయక రూపం



హౌసింగ్ బోర్డులో వేపచెక్కల వినాయకుడు

అనంతపురం కల్చరల్: ఐదు రోజుల వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నగరమంతటా బహురూపాల్లో వినాయకుడు సందడి చేస్తున్నాడు. పాతూరు, కమలానగర్, మొదటి రోడ్డు, రామనగర్ ప్రాంతాల్లో భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. వాడవాడలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భక్తిగీతాలాపనలు, సాంస్కృతిక సంబరాలు కొనసాగాయి. స్థానిక రాజు రోడ్డులోని ఆర్యవైశ్య విద్యార్థి గృహంలో నరసింహ సమేత వినాయకుడిని మంగళవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. నృత్య కళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం వినాయకుడికి నృత్యనీరాజనాలర్పించింది. వసతి గృహం అధ్యక్షుడు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ జరిగింది. అలాగే ఆలయాల్లో కొలువుదీరిన వినాయక మండపాల్లో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే ఆటపాటలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

నిమజ్జనం సాగేదిలా..

జిల్లా కేంద్రంలోనే అత్యంత వైభవంగా సాగే వినాయక చౌక్ వినాయకుడితో పాటూ నేత్రపర్వంగా కొలువుదీర్చిన వినాయకులను బుధవారం నిమజ్జనం చేయడానికి భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు సప్తగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశంలో నగర మేయర్ వసీం, జిల్లా ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథులుగా వినాయక చవితి ఉత్సవాలను ధ్వజరోహణంతో ముగింపు పలుకుతారు. అదేవిధంగా బ్రహ్మాండంగా సాగే శోభాయాత్రను ప్రారంభిస్తారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం నుంచి రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్ రోడ్డు, తాడిపత్రి బస్టాండ్, గాంధీ బజార్ నుంచి నేరుగా టవర్‌క్లాక్ మీదుగా బళ్లారి రోడ్డు వరకు వినాయకుల శోభాయాత్ర సాగుతుంది. అక్కడి నుండి కొడిమి వద్ద ఉన్న వంక, పంపనూరు, రాప్తాడు పండమేరు తదితర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం సాగుతుందని గణేష్ భక్త మండలి నిర్వాహకులు పరుచూరు రమేష్, మేధర వేణుగోపాల్ తెలిపారు.



కోవూరునగర్‌లో శంఖం వినాయకుడు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన
- కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీ
- కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని కూటమి సర్కార్ కార్పరేట్లకు ఊడిగం చేస్తోందని, ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన సాగిస్తున్నారంటూ ప్రధాని మోదీపై కార్మిక, కర్షక సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్మికుల పొట్టకొట్టే నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్రంలోని కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా నిర్మితమైన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని టవర్‌క్లాక్ వద్ద నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ తదితరులు మాట్లాడారు. ప్రైవేటీకరణ పేరుతో విశాఖ ఉక్కును కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రధాని మోదీ కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. పథకం ప్రకారం పరిశ్రమను నష్టాలబాట పట్టేలా చేస్తున్నారన్నారు. పరిశ్రమ మూత పడితే వేలాది మంది కార్మికులు, వారి కుటుంబాలు వీధిపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను తక్షణం నిలిపివేయాలన్నారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలన్నారు. అదే క్రమంలో స్టీల్ అథారటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టాన్ని కాలరాచే విధానాలు వీడకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు రామిరెడ్డి, కృష్ణుడు, చిరంజీవి పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతలో రాజీపడొద్దు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



ఈవీఎంలు భద్రపరిచిన గోదామును సీజ్ చేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) భద్రత అంశంలో రాజీ పడకూడదని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంల భద్రతను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణలోని గోదామును సందర్శించి అందులో భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేశారు. భద్రతా చర్యలను పరిశీలించారు. డీఫాల్ట్ కలిగిన 41 వీవీప్యాట్‌లు, ఈవీఎంల మరమ్మతుకు బెంగుళూరులోని బెల్ కంపెనీకి తరలించే ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల డీటీ కనకరాజు, డీటీ దివాకరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- జిల్లా మలేరియా అధికారి ఓబులు



అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

ఆత్మకూరు: మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. మంగళవారం మండలంలోని పంపనూరు తండాలో వైద్య సిబ్బందితో కలసి పర్యటించారు. గ్రామంలో మలేరియా కేసు నమోదు కావడంతో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల మధ్యలో, ఖాళీ ప్రదేశాల్లో పెరుగుతున్న పార్థీనియం, పిచ్చి మొక్కలను తొలగించి దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని సర్పంచ్ ఎర్రిస్వామికి తెలియజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ జ్వరం లక్షణాలు ఉన్న వారికి డెంగ్యూ, మలేరియా పరీక్షలను నిర్వహించి నమూనాలను ల్యాబ్‌కు పంపారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సలు చేయించుకోవాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సీహెచ్ఓ షమీమ్ తార, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్ మూర్తి, మధుబాబు, వెంకటరత్నమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

అనంతపురం: నగరంలోని సంగమేశ్వర సర్కిల్ సమీపంలో గఫూర్ ఆసుపత్రి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కమలానగర్ నుంచి సంగమేశ్వర సర్కిల్‌కు వెళ్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సాయి అనే యువకుడు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నదానం



పాపంపేటలో వినాయకుడి మంటపం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన వృశ్చిక వినాయకుడి మంటపం వద్ద నాలుగో రోజు మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. 8వ వండర్ బ్యాచ్ ఆధ్వర్యంలో ఈ వినాయకుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆకట్టుకుంటున్నాడు. బుధవారం వినాయకుడిని నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో ఎస్పీ



ఎస్పీ జగదీష్ దంపతులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ జగదీష్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎస్పీ కుటుంబ సభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎస్పీకి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం పంపనూరు ఆలయ విశిష్టతను ఎస్పీకి వివరించారు.

9 గంటల్లో 11 ఎకరాల్లో గుంటక పాసిన రైతు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన రైతు గొరువ మహేష్ అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం తొమ్మిది గంటల్లో 11 ఎకరాలు బడుగు గుంటుకతో పొలాన్ని పాసి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు మొదలు పెట్టిన పనిని మధ్యాహ్నం 12 గంటలకు పూర్తి చేయడంతో గ్రామస్తులు అభినందిస్తూ మహేష్‌తో పాటు ఆయన ఎద్దులనూ ఊరేగించారు. సాధారణంగా ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతుందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు.

పీహెచ్‌సీల్లోనే గర్భిణులకు స్కానింగ్

బెళుగుప్ప: పీహెచ్‌సీల్లోనే గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. బెళగుప్ప పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... బెళుగుప్ప పీహెచ్‌సీలో గర్భిణుల సౌకర్యార్థం త్వరలో స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అలాగే వారంలో ఒక రోజు లేదా, నెలలో కొన్ని రోజుల పాటు గైనకాలజిస్ట్‌ను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీల్లో 10 కాన్పులు తప్పనిసరిగా చేసేలా వసతులు కల్పించామన్నారు. అనంతరం రూ.1.2 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఎంఓలు త్యాగరాజు, గంగాధర్, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, లోకేష్, ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది



పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ

రాప్తాడురూరల్: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అనంతపురం రూరల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం రూరల్-5 సెక్టార్ పరిధిలోని విద్యారణ్య నగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు బరువులు, ఎత్తులు కొలతలు తీయించారు. అనంతరం గర్భిణులు బాలింతలను ఉద్దేశించి సూపర్‌వైజర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం, పాలు, కోడిగుడ్లు తదితర పోషక ఆహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తరచూ తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు చిన్నారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్త అరుణ, ఆయా కరిష్మా, మహిళా సంరక్షణ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

రాప్తాడు: సమతుల్యమైన పౌష్టికాహారంతో తీసుకుంటేనే బాలింతలు, గర్భిణులు, శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు, ఐదేళ్లలోపు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మంగళవారం జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో రక్తహీనత, ఇమ్యునైజేషన్, అనుబంధ పోహకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని చెప్పారు. వైద్యాధికారి శివకృష్ణ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణి, సీహెచ్ఓ శివప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, భారతి, ముత్యాలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి



హంద్రీనీవా కాలువ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరగాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ ప్రశాంత్ కుమార్, డీఎస్పీ ప్రతాప్ కుమార్, సీఐ హేమంత్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని పంపనూరు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. విగ్రహాల నిమజ్జనానికి చిన్న పిల్లలు, వృద్ధులను తీసుకురాకూడదన్నారు. విగ్రహాలు కాలువలో వేయడానికి క్రేన్, జేసీబీలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అంతేకాకుండా నిమజ్జనం చోట పెద్ద పెద్ద లైట్లు ఏర్పాటు చేసేలా మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి దాదాపు 200 వరకూ పెద్ద విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో రోడ్డుపై వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గజ ఈతగాళ్ల అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, ఏఎస్ఐ దస్తగిరి పాల్గొన్నారు.